


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 16 సెప్టెంబర్, 2019 సంచిక : 4

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| వార్షిక చందా ... | రూ॥ 100/- |
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ 200/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ॥1000/- |



**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,
రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2
కుంతి ప్రార్థన ........ 5
సజ్జనుల లక్షణములు ........ 8
నీరాజనం ........ 12
మాతృమూర్తులకు మనవి ........ 13
దేశం-ధర్మం ........ 16
తస్మాత్ జాగ్రత్త ........ 18
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 21
మాతృసంస్థ కబుర్లు ........ 25
మనన యోగ్య శ్లోకాలు ........ 28
శ్రీ సాయినాథానందలహరి ........ 30
ఆశ్రమ భిక్ష ........ 31
ప్రశాంతి ........ 32


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



"సర్వే భవంతు సుఖినః సర్వేసంతు నిరామయా
సర్వే భద్రాణి పశ్యంతు, మా కశ్చిత్ దుఃఖభాగ్భావేత్ ॥"

ప్రతి జాతికీ కొన్ని ప్రత్యేకతలుంటాయి, జీవన మూల్యాలు ఉంటాయి, ఒక పరంపర ఉంటుంది. వాటిని బట్టే ఆ జాతినీ, ఆ దేశాన్నీ గుర్తిస్తూ ఉంటాము.

మన హిందూ దేశపు జీవనమూల్యాలకు ప్రతీకయే పైన పేర్కొనబడిన ప్రార్థన. ప్రపంచంలోని ప్రతి మానవుడు-మానవుడు మాత్రమే అననేల-ప్రతి జీవి సుఖశాంతులతో వర్థిల్లాలి; రోగరహితమై జీవించాలి; సర్వ జీవులకూ క్షేమం కలగాలి; ఎక్కడా ఎవ్వరూ దుఃఖ స్పర్శను పొందరాదు.

ఇటువంటి శ్రేష్ఠమైన ఆదర్శాల్ని అందించిందీ మన ఋషివాణి. ఆ ధర్మాన్ని అందించటమే కాదు-వాటిని సాధించటానికి మార్గదర్శక సూత్రాల్ని కూడా బోధించింది ఆ ఆర్షవాణి.

ఈ బోధను సంక్షిప్తంగా చెప్పాలంటే-ప్రతి వ్యక్తీ శాంతి సహనాలతో, సత్యాహింసలతో ధర్మమార్గాన నడవాలి. అప్పుడు ఎవ్వరూ ఎవ్వరికీ అపకారం చెయ్యరు సరికదా చేతనైనంత ఉపకారం చేస్తుంటారు. అందరూ సుఖశాంతులతో విలసిల్లుతుంటారు-ఇదీ ఆదర్శ సమాజం. మన మందరం నిరంతరం కాక్షించేది ఇటువంటి సమాజాన్నే.

జనాభా చాలా తక్కువగా ఉండి సంపదలు పెక్కులుగా ఉన్న కృత యుగంలో ఇది సాధ్యమయిందేమో (అప్పుడు ఎడనెడా రాక్షసులు లేకపోలేదు.)

ద్వాపరయుగంలోనూ, ఆపైన వచ్చిన నేటి కలియుగంలోనూ దుర్మా

ర్గుల సంఖ్య ప్రబలిపోతున్నది. మరి నేటి సమయాన కూడా ఏ పరిష్కా రమూ సాధించకుండానే శాంతి సాధ్యమా?

అలనాడే మన ఋషులు ఘోషించారు ...

"లోకో2యం క్షోభరహితః, సజ్జనాః సంతు నిర్భయాః

లోకములో కీడుపీడలు లేకుండగాక, మంచి వారందరూ భయము లేనివారై ఉందురుగాక.

అంటే లోకంలో అప్పుడప్పుడూ కొందరు కొందరికి క్షోభ కలిగిస్తూ ఉండే అవకాశం ఉందనీ, దుర్జనులు, సజ్జనులు అనే విభాగం ఉంటూ వచ్చిందనేది స్పష్టం.

మరి ఈ దుర్జనులు దాడి చేస్తున్నప్పుడు, హింసిస్తున్నప్పుడు సజ్జనులు నిర్భయులుగా ఉండే అవకాశం ఎలా సంభవిస్తుండేది?

దుర్మార్గుల నుండి వారికి రక్షణ కల్పించబడటమో లేదా ఆ దుర్మా ర్గులను సన్మార్గులుగా మార్చి మంచివారినీ వారి మర్యాదలనూ కాపాడే టట్లుగా చేయటమో జరగాలి.

హఠాత్సంఘటనలతో, తాత్కాలిక ప్రతీకారేచ్ఛతో హింసకు పూనుకున్న వారు (అంగుళిమాలురు మొ॥) క్వాచిత్కంగా మార్చబడ్డారు తప్ప ధర్మ వ్యతిరేకులై జననష్టానికి తెగబడినవారు ధర్మాత్ములుగా ప్రేమమయులుగా మారిన జాడలు కన్పించవు.

ఏ సత్యాగ్రహాలూ కంస, కాలనేమి, జరాసంధ, కౌరవాదులను మార్చి నట్లు కన్పించదు. వీటికి సహజ సంస్కారవంతులు మాత్రమే స్పందిస్తారు.

మరి దుర్జనుల నుండి సజ్జనులకు రక్షణ-అధర్మీయుల నుండి ధర్మ పరులకు రక్షణ ఎటుల?

రెండవ ప్రపంచయుద్ధంలో ఇంగ్లాండు చావుదెబ్బ తిని తన సామ్రాజ్యం లోని అన్ని దేశాలకు (ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, దక్షిణ ఆఫ్రికా మొ॥) స్వతంత్ర్యత ఇవ్వటం పుణ్యమా అని మనం ఈ నామకః స్వాతంత్ర్యం





సంపాదించిన 55 సంవత్సరాలలో మన భారతీయ ఆత్మ ఎంతగా ఆవిష్క రింపబడిందీ-ఈ స్వతంత్ర్య దేశంలో ధార్మిక జీవనం ఎంతగా విలసిల్లి, ఇతర దేశాల నుండి వచ్చిన వారినీ, విధర్మీయులను ప్రభావితం చేసిందీ- అనే విషయాన్ని బేరీజు వేసుకుంటే (నేల విడిచిన సాముగా చెబుతున్న వేదాంతోపన్యాసాలు, ధన సంపాదనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని నడప బడుతున్న యోగా తరగతులు, ధార్మిక చింతననూ దేశప్రేమనూ ఎంతగా పెంచుతున్నాయో మీ అందరికీ తెలుసు.)

ఒక భయానక స్థితి కన్పిస్తున్నది. తనదాకా రాకుంటే దేశం, ధర్మం ఏమైనా ఫరవాలేదు-అనే మార్గంలో ప్రతిరంగంలోని వ్యక్తులు పయనిస్తు న్నారు. ఇలా ధర్మాన్ని, శాంతిని నాశనం చేసే వారి కొమ్ముకాచి వారికి పరోక్షంగా సహకరిస్తూ ధార్మిక చింతనాపరులను వెక్కిరిస్తూ, అసలే అసమర్థులుగా బ్రతుకుతున్న శాంతికాముకులను ఇంకా నిర్వీర్యులను చేసి బలిపశువులుగా మారుస్తూ, తాము శాంతి దూతలుగా విధర్మీయుల చేత కీర్తింపబడుతూ ఉన్నారు.

క్రమంగా ధర్మం కోసం, నిజమైన శాంతి కోసం నిలబడటానికే భయ పడవలసిన పరిస్థితుల్ని నిర్మాణం చేస్తున్నారు.

మరి లోకశాంతి కారకమైన ఈ సనాతన ధర్మం ఇలా నశింపజేయ బడుతుంటే చూస్తూ ఊరుకోవటమేనా-దయ్యాలు వేదాలు వల్లిస్తుంటే, నూరు ఎలుకల్ని తిన్న పిల్లి కాశీ, మక్కా యాత్రలు చేస్తుంటే-ఇంకా ప్రేమ సమాజం ఎక్కడ, శాంతి స్థాపన ఎక్కడ.

దీనికి పరిష్కారం ఎక్కడ?

జగద్గురువు ఆ శ్రీకృష్ణ పరమాత్మ గత శతాబ్దంలో దేశనాయకత్వం వహించిన వారి కంటే తెలివితక్కువ వాడని భావించే వారెవ్వరూ ఉండరు. ధర్మస్థాపనకు తద్వారా శాంతిస్థాపనకు అవతరించి, ఉపదేశించి - ఆచరించిన మార్గమే నాటికి, ఈనాటికి మరే నాటికి శరణ్యం.

ఆయన ఆచరణాత్మకంగా శాంతి స్థాపన చేసి చూపించాడు.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥"

- ఇదీ ఆయన మాట, ఆయన బాట.

పరమాత్ముని ఆదేశాన్ని మన్నించక విధర్మీయుల నుండి కీర్తిని పొందాలనే తపనతో బలహీనపడిన ధార్మిక జాతిని ఇంకా బలహీన పరుస్తూపోతే ఇక నిష్కృతి లేదు. ప్రపంచానికే శాంతి కరువవుతుంది.

అందుచేత యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడు కలిసి నడవాలి-శాంతి స్థాపన - తద్వారా లోకకళ్యాణం జరగాలి.

"లోకాః సమస్తా సుఖినో భవంతు" - తథాస్తు

భారత వర్షము నశించెనా - ప్రపంచమందలి పారమార్థికత యంతయు నశించును. నైతిక పరిపూర్ణత యంతయు నశించును.

**- స్వామి వివేకానంద**



# కుంతి ప్రార్థన

- శుకవాణి

మహాభారతంలో కుంతీదేవిది ఒక విచిత్రమైన, విశిష్టమైన పాత్ర.

మైథిలీ శరణ్‌గుప్త అనే హిందీ కవి అన్నట్లు "కన్నుల నిండా నీరు-గుండెల నిండా పాలు-ఇదే నారీ జీవనం"-యీ సూక్తికి సరిగ్గా సరిపోయే పాత్ర కుంతీదేవిది.

భర్త మృతి తర్వాత చిన్నా చితుకుగా ఉన్న సంతానాన్ని వెంట పెట్టుకొని ధృతరాష్ట్రుని ఇంటికి చేరుకున్నది. నాటి నుండి ఆమె అనుభవించని ఆవేదనలు, ఆందోళనలు లేవు.

వివాహానికి పూర్వం సూర్యవర ప్రభావం వలన తనకు జన్మించి, సమాజ భయంతో తన చేత గంగలో విడువబడి; అతిరథునికి దొరికి,





అతని భార్య రాధ పొత్తిళ్లలో పెరిగిన కర్ణునికి, తన పుత్రుడైన అర్జునుడికి నడుమ ఏర్పడుతున్న విద్యా స్పర్థను చూచి చిన్నవోయింది.

కుమారాస్త్ర విద్యా ప్రదర్శనంలోను, ద్రౌపది స్వయంవరంలోను కర్ణుడు సహించవలసి వచ్చిన అవమానాలకు కుంతి ఎంతగా కుమిలిపోయిందో, పుత్ర వ్యామోహంతో ధృతరాష్ట్రుడు తన బిడ్డలకు ధర్మబద్ధంగా రావలసిన రాజ్యాన్ని సరిగా ఇవ్వనపుడు ఆమె ఎంతగా నొచ్చుకుందో, కొడుకుల వనవాసాన్ని, వారనుభవిస్తున్న క్లేశాలన్నింటినీ వింటూ, మూగసాక్షిగా విదురిని పంచన తలదాచుకున్న ఆ తల్లి హృదయంలో ఎన్ని బడబాగ్నులు చెలరేగినవో సర్వసాక్షికే తెలియాలి.

సరే, జరగవలసినది జరగనే జరిగింది. మహాయుద్ధం పరిసమాప్తమయ్యింది. పాండవులకు రాజ్యం దక్కింది. కానీ దాదాపుగా పాండవుల పుత్రులందరూ అటు యుద్ధంలోనో, ఇటు అశ్వద్ధామ చేతిలోనో హతమైపోయారు.

ఆ దుఃఖోద్విగ్నితలన్నీ కొంత అణగారిన పిదప శ్రీకృష్ణుడు తన స్వస్థలమైన ద్వారకకు మరలిపోయేందుకు సంసిద్ధుడైనాడు. అప్పుడు కుంతీదేవి కృష్ణుడిని పరిపరి విధాల స్తుతించింది.

"నీ వారలమైన మమ్ము విడిచి విచ్చేయనేల?" అని ప్రేమపూర్వకంగా పలుకుతూ, ఒక ప్రార్థన చేసింది. ఆ ప్రార్థన సాధకులందరికీ గొప్ప మార్గోపదేశం చేయగలట్టిది.

సాధారణంగా మనం-అంటే సామాన్యులం-ఇల్లు, వాకిలి, పిల్ల-పాప, ఉద్యోగం, సద్యోగం, ఇలాంటి వాటి గురించే ప్రార్థిస్తుంటాం. ఇంకొక మెట్టు పైకెక్కితే లోకక్షేమం కొరకు, మోక్షం కొరకు విన్నపం చేసుకుంటాం. కానీ కుంతీదేవి ఏమని కోరిందో చూడండి -

యాదవులందుఁ బాండుసుతులందు నధీశ్వర! నాకు మోహవి
చ్ఛేదము సేయుమయ్య! ఘనసింధువుఁ జేరెడి గంగ భంగి నీ

పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయ బుద్ధిన
త్యాదర వృత్తితోఁ గదియు నట్లుగఁ జేయఁగదయ్య! ఈశ్వరా!

తన పుట్టినింటి వారైన యాదవుల పట్ల, తన కన్నబిడ్డలైన పాండు సుతుల పట్ల కూడా తనకున్న మోహాన్ని, మమకారాన్ని తుంచివేయమని ప్రార్థించింది. అంటే తనకు మూలమూ వద్దు; తాను మూలంగా ఉండడమూ వద్దు. మహాసాగరాన్ని చేరే గంగానదిలాగా తన హృదయం వెళ్ళి, ఆ పరమాత్మ చింతనా సముద్రంలో మునిగిపోవాలి. ఆ వరం ఇవ్వమంటున్నది కుంతి.

స్త్రీలు (సాధారణంగా) తమ పుట్టినింటి అభిమానాన్ని మరచిపోరు. మరణకాలంలోనైనా 'మన వాళ్ళు' అనే భ్రాంతి వదులుకోరు. కానీ, కుంతీదేవి ఆ మమత్వాన్ని జయించాలనుకుంటోంది. అన్ని కష్టాలు కడతేరి ప్రశాంతంగా బ్రతకడానికి వీలైనస్థితి ఏర్పడ్డాక-చాలా నిర్లిప్తంగా అడుగుతోంది- "నాకు మోహవిచ్ఛేదనము సేయవయ్య!" అని.

ఇది సాధకులందరి కోరికా కావాలి. ఉత్తి కోరికే కాదు. అదే సాధన కావాలి కూడా.

అంతేకాదు మరో మాటగా ఇలా అంది కుంతీ.

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహి నరేంద్ర వంశ దహనా! లోకేశ్వరా! దేవాతా
నీక బ్రాహ్మణ గోగణార్తిహరణా! నిర్వాణ సందాయకా!
నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యాను కంపానిధీ!

కృష్ణుడు స్వయానా తన మేనల్లుడు. తన బిడ్డ అర్జునునికి పరమ మిత్రుడు; సౌందర్యం మూర్తీభవించినట్టివాడు; మహా వీరుడు; ధర్మ సంస్థాపకుడు; మోక్ష ప్రదాత; అన్నింటినీ మించి గొప్ప కారుణ్యమూర్తి. అటువంటి ఆ అప్తదైవాన్ని చూచి కుంతీదేవి వేరేవీ అడగకుండా ఒకే ఒక్క ప్రార్థన చేస్తున్నది -





"నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్" - ఐహిక భ్రాంతులు, ప్రేమలు అన్నీ లతల వంటివి. ఏదో ఒక ఆశావృక్షాన్ని ఆధారం చేసుకొని పాకిపోతూ ఉంటాయి. అందుకని వాటిని ఎక్కడో ఒకచోట ననలు సాగకుండా త్రుంచివేయాలి. ఆ పని మన ఒక్కరి వలన కాదు. పరమాత్మ కరుణ ప్రసరించాలి. అందుకే ఆమె "త్రుంపవే భవలతల్" అన్నది.

మనమందరం కూడా పరమాత్మను ప్రార్థించేటపుడు ఈ ఒక్కటి అడిగితే చాలు. కుంతీదేవిలోని ఆ వివేకం, జ్ఞానం, మనలోకి రావాలని.... మన ప్రార్థన కూడా అదే కావాలని ఆశిద్దాం.



# సజ్జనుల లక్షణములు

- రామచరిత మానస్ నుండి

భరతుడు "శ్రీరామచంద్ర ప్రభూ! నేను సజ్జనుల లక్షణములను విన గోరెదను. మీరు దయానిధులు, జ్ఞానగుణ సముద్రులు, శరణాగత రక్షకా! సాధు-అసాధువులలో గల భేదములను వివరింపుడు".

శ్రీరాముడు ఇలా పలికెను.

ఇతరుల దుఃఖములను తమ దుఃఖములుగా, ఇతరుల సుఖములను తమ సుఖములుగా భావించెదరు. వారు అన్నిటియందును, అన్నిచోట్లను, అన్ని సమయముల యందును సమత్వము కలిగియుందురు. వారి మనస్సులలో శత్రుత్వం ఉండదు. వారు అభిమాన రహితులు, విరాగులు.

వారిలో లోభము, క్రోధము, హర్షము, భయము లేశమాత్రము గూడ ఉండవు. వారి హృదయాలు కోమలములు. దీనులయెడ, దుఃఖితుల పైనను దయ చూపుదురు. మనోవాక్కాయకర్మలచే నాపై నిష్కపట భక్తిని

గల్గియుందురు. వారు స్వయంగా అభిమానరహితులై ఇతరులను సమ్మానించెదరు.

భరతా! ఇట్టి సజ్జనులు నాకు ప్రాణతుల్యులు. వారికి ఎట్టి కోరికలును ఉండవు. వారు నా నామస్మరణ నందే నిరతులు. సజ్జనులు శాంతి, వైరాగ్యము, వినయము, ప్రసన్నత కలిగియుందురు. వారిలో శీతలత్వము, సరళత, అందరియెడ మిత్రభావము బ్రాహ్మణభక్తి ఉండును. ఇదియే ధర్మమునకు మూలము.

సోదరా! ఈ లక్షణములు గల వారిని సజ్జనులుగా భావింపుము. వారు శమ, దమ, నియమ, నీతి మార్గముల నుండి ఎన్నడునూ వైదొల గరు. వారెప్పుడును పరుష వచనములను పలుకరు.

నిందాస్తుతులను సమానంగా భావించువారు; నా పాదపద్మముల యందు అనన్యప్రేమ కలిగియుండువారు సజ్జనులు. వారు నాకు ప్రాణ సమానులు, గుణధాములు, ఆనంద స్వరూపులు.

ఇక దుర్జనుల లక్షణములను వినుము.

పొరపాటున గూడ వారితో సాంగత్యం చేయరాదు. వారి సహవాసం దుఃఖమునకు కారణము. దుర్లక్షణములు గల గోవుతో కలిసి తిరుగుట వలన మంచి కపిల గోవు కూడ అట్లే మారును. దుష్టులైన వారి హృదయాల యందు సంతాపమధికము.

వారు ఇతరుల సుఖసంపదలను జూచి అసూయపడెదరు. ఎప్పడైనను ఇతరులను గూర్చిన నిందలను విన్నచో త్రోవలో నిధి దొరికినంతగా సంతోషపడెదరు. వారు కామ, క్రోధ, లోభ, మద పరాయణులు, నిర్ద యులు, కపటులు, కుటిలురు, పాపిష్ఠులు. వారు అకారణంగా ఇతరులతో వైరము పూనెదరు.

మేలు చేసిన వారికే కీడు తలపెట్టెదరు. వారి ఆదానప్రదానము లన్నియును సత్యదూరములు. స్వార్థ దృష్టితో చేయబడునవి. అనృతమే వారి భోజనము, వారి అన్ని విషయాలయందును అసత్యమే పలికెదరు. నెమలికూత (క్రీంకారము) మధురము. కాని దాని ఆహారము మహా





విషసర్పాలు. అట్లే దుర్జనుల మాటలు మిక్కిలి మధురములు, కాని వారి హృదయాలు మిగుల విషపూరితములు, కఠినములు.

దుష్టులు ఇతరులతో నిష్కారణంగా వైరము పూనెదరు. పరస్త్రీల యందును, ధనము నందును ఆసక్తులైయుందురు. పరులు నిందల పాలైనచో సంతోషపడుచుందురు. వారు నీచులు, పాపాత్ములు, మానవ శరీరములను ధరించిన రాక్షసులు.

దుర్మార్గులకు లోభమే దుప్పటి, లోభమే పరుపు (లోభములోనే మునిగి యుందురు). ఆహార మైధునములయందే నిరతులైయుందురు. యమ లోక భయము వారికి ఉండదు. ఇతరుల అభివృద్ధిని చూచినను, విన్నను జ్వరపీడితుల వలె నిట్టూర్పులు వదలెదరు. ఇతరులకు విపత్తు కల్గినప్పడు చూచినను, విన్నను విశ్వమున కంతటికిని రాజైనంతగా సంతోషింతురు.

వారు కటిక స్వార్థపరులు. వారు కామలోభ లంపటులై, మిక్కిలి క్రోధ స్వభావులై, తమ కుటుంబసభ్యులతో గూడ విరోధము కలిగియుందురు. వారు తల్లిదండ్రులను, గురువులను, బ్రాహ్మణులను-అంతేకాదు ఎవ్వరినీ గుర్తింపరు, గౌరవింపరు. తాము నశించుటయే గాక ఇతరులను గూడ నష్టపరచెదరు.

మోహవశమున ఇతరులతో వైరము వహింతురు. వారికి సజ్జన సాంగత్యమునగాని, హరికథల యందు గాని అభిలాషయే యుండదు. వారు సద్గుణ సాగరులు, మందబుద్ధులు, కాముకులు, వేదములను దూషించువారు. పరధనములను కబళించువారు. బ్రాహ్మణులకును, విశే షంగా దేవతలకును, కడకు పరమాత్మకును ద్రోహము చేయుదురు. వారి హృదయము దంభ కపట పూరితములు. వంచన చేయుటయే వారి స్వభావము. వారు పయోముఖ విషకుంభాలు. చూచుటకు సజ్జనుల వలె కన్పింతురు.

ఇట్టి అధములు దుష్టులైన మనుజులు కృతయుగము నందును, త్రేతాయుగమునందును ఉందురు. ద్వాపరయుగములో స్వల్పముగా

ఉండెదరు. కాని కలియుగంలో వీరు కోకొల్లలు. వీరి సంఖ్య అపారము, అగణ్యము.

సోదరా! పరోపకారముతో సమానమైన ధర్మము లేనేలేదు. ఇతరులకు కీడు చేయుట కంటే వేరొక పాపమే లేదు.

నాయనా, వేదపురాణాలలో తెలుపబడిన విషయాలు నీకు సంగ్రహంగా వినిపించితిని. పండితులు వీటిని ఎఱుగుదురు. మానవ శరీరములను పొందియు, ఇతరులకు కీడు తలపెట్టువారు జనన మరణ చక్రములో పరిభ్రమించుచు క్లేశములను అనుభవింపవలసియుండును.

మనుష్యులు మోహవశమున స్వార్థములో మునిగి, పెక్కు పాపములను చేయుచుందురు. అందువలన వారు సద్గతులను పొందజాలరు. పైగా నరకయాతనలకు గురియగుదురు.

సోదరా! నేను వారికి యమునితో సమానుడను. వారి మంచి చెడు కర్మలకు తగిన ఫలములను ఒసంగెదరు. దీనిని ఎఱింగి జ్ఞానులు, సంసారము దుఃఖరూపమని తెలుసుకొని నన్ను భజింతురు. శుభాశుభ ఫలములనిచ్చు కర్మలను వదిలి, వారు దేవతలకును, మనుష్యులకును, మునీశ్వరులకును అధి దేవతనైన నన్ను భక్తితో భజింతురు.

ఇంతవరకు సజ్జన దుర్జనుల లక్షణములను తెల్పితిని. ఈ జనుల గుణదోషములను ఎఱింగిన వారు జనన మరణ చక్రములో పడరు.

నాయనా! వినుము. లోకంలోని గుణదోషములు అన్నియును మాయా కల్పితములే. ఈ రెండింటిని చూడకూండుటయే వివేకము. వాటిని చూచుట అవివేకము.

'శ్రీరామచంద్ర ప్రభు ముఖతః' ఈ వచనములను విన్న పిదప సోదరులందరును ప్రసన్నచిత్తులైరి.





# నీరాజనం

- రంగారావు మండువా

నారాయణు డాద్య గురుడు
ఆరాధ్యుడు శంకరుండు అవనిన దలచన్ ।
ఈ రోజున గురు పున్నమి
ఔరా! వ్యాసుని గొలువుడు ఔత్సాహమునన్ ।

కం. గురుడగు వ్యాసుడు మనకును
గురుపూజ గఱపి తమతమ గురువుల గొల్వన్
గురుసామీప్యము జేరుడు
గురువును గొలుచుట పరమగు గుణమెన్నంగన్ ॥

కం. గురుడే తల్లియు దండ్రియు
గురుడే దైవంబు నీకు గురుడే సఖుడౌ ।
గురుడే సర్వము గనుమది
గురుడే నీకతియు గతియు గురుతెరుగుమికన్ ॥

కం. గురుడుని గుండెలో నింపిన
గురు మార్గపు వెలుగు జూపి గురుతుగ జేర్చున్ ॥
గురు పథము బట్టి నడిచిన
గురి దప్పక జేర్చు నిన్ను గూటికి యతడున్ ॥

కం. గురుడొకడు లేక యున్నను
గురుతెరుగు మదియగు నీకు గ్రుడ్డిది బ్రతుకన్ ।
గురుడుని వెదకుము జగతిన
గురుడే లేకున్న నీవు గూటికి జేరవ్ ।

ఆ.వె. నాదు చేయి బట్టి నడిపించు నాగురుండు
తానె కాంతి యగుచు దారి జూపు
సంస్కరించి నన్ను సంసార మీదించు
మోక్షమమర జేయు మోద మమర ।

కం. తెలిసియు తెలియక గురువును
వెలితేమియు లేక గొల్వ వెతలను దీర్చున్ ।
కలకాలము నిను వీడక
ఇలలో నీవెంట నుండి యిచ్చును మోక్షం ॥

కం. సాయినాథు కరుణ సానుకూలముగల్గె
గురుడు నాకు దొరకె గురుతు దెలసి
గురుని వీడకుండ గురు పథమును బట్టి
సాగుచుంటి నేను సాయి పథము ॥

ఆ.వె. గురుడు నాకు జూపె గురుడగు సాయిని
దీన జనుల బ్రోచు దివిజు డతడు
స్మర్తుగామి సాయి ।
సాయంబు నందించ తలచినంత లోనె తరలి వచ్చు ।

ఈ నవరత్నాల మాల నా గురుదేవుల పాదపూజకు.



# మాతృమూర్తులకు మనవి

- శ్రీ మాధవరావు గోళ్వల్కర్ గురూజీ

(పాంచజన్యం నుండి)

(గత సంచిక తరువాయి)

**ఆధునికతకు ఆహుతి**

ఇక మన కౌటుంబిక సంప్రదాయాలను, వ్రతనిష్ఠలను గూర్చి ఆలోచిద్దాం. మన ఇష్టదైవం, కులదైవం ఎవరైనప్పటికినీ, ఎంతో భక్తితో వారిని మనం ఆరాధించాలి. పవిత్రమైన మన వంశాచారాన్ని ఉజ్వలంగా ఉంచుకోవాలి. ఈ రోజుల్లో ఇట్టి పద్ధతులు అదృశ్యం అవటం చూస్తుంటే ఎంతో విషాదం కలుగుతోంది.





దక్షిణాదిన కనీసం మన ఇళ్ళ ముంగిట తులసికోటలను తరచు చూస్తుంటాం. సందెచీకట్లు ముసురుతుండగా మన మాతృమూర్తులు దాని ముందు దీపారాధన చేస్తారు. తరచుగా పూజాగృహాల నుండి మధురమైన ఘంటా నినాదాలను వింటూ ఉంటాం. ఇళ్ళలో భక్తియుక్తమైన పూజలు కొనసాగుతూ ఉంటాయి.

కాని ఉత్తరాదిన మాత్రం ఇట్టి దృశ్యం చాలా అరుదు. ఆధునికత మన ఇండ్ల నుండి భగవంతుణ్ణి నిజంగా తరిమేసింది. ఇలా 'ఆధునికత' మనం సగౌరవంగా భావించే జీవన మూల్యాలనెన్నింటినో దిగమింగేస్తోంది.

"సుగుణవతి తన శరీరాన్ని కప్పకున్నట్లే సజ్జనుడు తన మంచి పనుల మీద వినయమనే ఉత్తరీయాన్ని కప్పకుంటాడు" అని జ్ఞానేశ్వరిలో ఒక ద్విపద కవిత ఉంది. సద్గుణాలు కల స్త్రీ స్వభావాన్ని అది సూచిస్తోంది.

కానీ "నేటి స్త్రీలు" పదిమందికీ కంటబడేటట్లుగా తన శరీరాన్ని అధికంగా ప్రదర్శించడంలోనే ఆధునికత ఉందని భావిస్తున్నారు. ఎంతటి పతనస్థితి!

మన దేశంలో 'ఆధునికత' అంటే అర్థం గుడ్డిగా పాశ్చాత్యుల్ని అనుకరించడం తప్ప మరింకేమీ కాదు అని భావిస్తున్నట్లగుపిస్తోంది.

ఎన్నో అధునాతన కుటుంబాల్లో పిల్లలు తమ తల్లులను 'మమ్మీ' అని సంబోధిస్తుంటారు. ఆ మాటకు అసలైన అర్థమేమిటో మనకు తెలుసునా?

ఈజిప్టు దేశంలో, అచటి వారి యొక్క ప్రాచీన చక్రవర్తుల శవపేటికలపై నిర్మించిన పెద్ద సమాధులున్నాయి. వానికి 'పిరమిడ్లు' అని పేరు. వాని లోపల ఉంచిన శవాలకు 'మమ్మీ'లని పేరు.

మరి ఇక్కడ మనం జీవంతో తొణికిసలాడే ప్రియమైన మాతృమూర్తులను మమ్మీలని సంబోధిస్తుంటాం!

మన జాతి నిరంతరం ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూనే ఉందని మనందరికీ తెలుసు. మాతృభూమి యొక్క సమైక్యతనూ, మన సమాజాన్ని కించ

పరచటానికి ప్రయత్నాలు అనేకంగా జరుగుతూనే ఉన్నాయి.

మన ఆధ్యాత్మిక వారసత్వంలోని చిరంతనములైన విలువలపై సవాళ్లు ఎక్కువవుతున్నాయి. సంఘర్షణలూ, పోరాటాల వాతావరణం అంతటా నిండి ఉంది. ఇట్టి పరిస్థితుల్లో మన పిల్లలకు ఏ విధమైన శిక్షణ ఇవ్వాలి? తమ ఇండ్లలోనే ఒళ్ళు దాచుకుంటూ, చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష అనుకుంటూ వెలికిరాకుండా బ్రతకటం వారికి నేర్పుదామా?

స్వసౌఖ్యం, భవిష్యత్తుల గురించి నటువంటి విషయాల మీద మాత్రమే ప్రాధాన్యత చూపుతూ ఇంకొకళ్ళ జోలి శొంఠి పట్టించుకోవద్దని వారికి చెప్పదామా? వారికి మనం ఏమి నేర్పుదాం?

మహాభారతంలో చక్కని కథ ఒకటుంది.

విదుల అనే పేరు గల రాణి ఉండేది. ఆమె తన కుమారుడైన సంజయుణ్ణి యుద్ధభూమికి పంపింది. కాని అతడు భయంతో గజగజలాడిపోయాడు. శత్రువులకు వెన్నిచ్చి, గుర్రమెక్కి తన రాజధానికి పరుగులెత్తాడు.

కొడుకు ఓటమి నంది అప్రతిష్ట పాలవడం జూచి, ఆమె తన కోట ముఖద్వారాన్ని మూయించి, తీవ్రంగా అతణ్ణి చీవాట్లు పెట్టింది. ఆ తల్లీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణ విదులా-సంజయ సంవాదంగా ప్రసిద్ధికెక్కింది.

దానిలో యుద్ధరంగంలో ఒక సాహసవంతుడైన యోధుడు ఎట్లా ప్రవర్తించాలో ఆమె తన కొడుక్కి ప్రబోధించింది. అటుపైన మరల యుద్ధానికి పోయి విజయం సాధించిన వీరుడుగా తిరిగి రమ్మని ఆమె ఆజ్ఞాపించింది.

ఆ కథ ప్రకారం సంజయుడు యుద్ధరంగంలో ప్రవేశించి ఆదర్శప్రాయమైన పౌరుష పరాక్రమాన్ని చూపించి సగౌరవంగా తన మాతృమూర్తి స్వాగతించేలా విజయం సాధించి తిరిగి వచ్చాడు.





# దేశం-ధర్మం

- శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యాపదానంద ప్రభూజీ

ధర్మమేవ హతోహంతి, ధర్మో రక్షిత రక్షితః

ఇది అనాది ఆర్యోక్తి. ధర్మం శాశ్వతం, స్థిరం వేళకాల పాత్రలకు అతీతమైన ఒకానొక శక్తికి ధర్మం అని పేరు. వేళాకాలాలను బట్టి పైపై ఆచారాలు, సంప్రదాయాలు మారుతున్నట్లు కన్పిస్తాయి గానీ - మౌలికమైన ధర్మం వీటన్నిటి కంటే ఉత్తమం, అతీతమున్నూ. ఇక దేశం అన్నది ఏవో కొన్ని సరిహద్దులకు, కొన్ని రకాల జీవనరీతులకు పరిమితమై ఉన్నట్టిది కదా! అలాంటప్పుడు యీ రెండింటికీ పోలిక పెట్టటం ఏమిటి? అనిపిస్తుంది. అయితే యివి పరస్పరాశ్రితాలుగా ఎలా ఉంటాయో పరిశీలిద్దాం.

ఈ మన భూగోళంపైన కొన్ని ప్రాంతాలలో ఆయా వాతావరణాలు - ఆ ప్రాంతాలలో పుట్టి పెరిగే జనుల మీద శారీరకంగాను, మానసికంగాను ప్రభావాన్ని చూపిస్తూ ఉండటాన్ని గమనిస్తాం. శీతల ప్రదేశాలలోని ప్రజలు ఎక్కువగా లౌకిక భావాలు కలిగి లోకవ్యవహారాలలో తగుల్కొని సుఖభోగాలలో మునిగితేలుతూ ఉండటం కన్పిస్తుంది. అతి ఉష్ణ ప్రదేశాలలో పుట్టి పెరిగే వారిలో క్రౌర్యమూ, మూర్ఖతా ఎక్కువ పాళ్ళలో కన్పిస్తాయి. ఇక సమశీతోష్ణ మండలాలలోని వారిలో నాగరికతా, సంస్కృతీ ఎక్కువ అభివృద్ధిలో కన్పిస్తాయి. అందునా మన భారతదేశంలోని గంగా, సింధూ, యమునా, సరస్వతీ, గోదావరీ, కృష్ణా మొదలైన పుణ్యనదీ తీరాలు అతి ప్రాచీన కాలం నుండి విశ్వ సంస్కృతికీ, ధర్మానికీ పట్టుగొమ్మలుగా వెలిశాయి. ప్రపంచంలోని మిగతా ప్రదేశాలలో బట్టలు కట్టుకోవటమే తెలియని రోజులలో ఇక్కడ, మన పవిత్ర భారతదేశంలో, గొప్ప సంస్కృతి వెలిసింది. వేదాలు, ధర్మశాస్త్రాలు ఆవిర్భవించినై, ఇది ఈ దేశపు ప్రత్యేకత. ఈనాటి

సప్తసింధు ప్రాంతమే వీటన్నిటికీ కేంద్రస్థానమై వెలిసింది. గ్రీకుల దండయాత్రల సమయానికి దురదృష్టవశాత్తూ సనాతన ధర్మానికి మూల స్తంభమైన, వేదాంతసారమైన, యావత్తు ప్రపంచానికి జ్ఞానదాతయైన భగవద్గీత బోధలు మరుగునపడటం వల్ల మన వేదభూమి కొంత కొంతగా దురాక్రమణలకు లోనౌతూ వచ్చింది. దీనికి కారణం మనలో ధర్మ, దీక్ష, సామాజిక స్పృహ కొరవడటము. ఎక్కడెక్కడ ఈ భారతమాత దురాక్రమణకు గురి అయినదో అక్కడక్కడ ధర్మభ్రష్టత్వం జరుగుతూ వచ్చింది. క్రౌర్యం ప్రబలిపోతూ శాంతి నశిస్తూ వచ్చింది. ధర్మనాశకులు దేశాల్ని ఏదో విధంగా ఆక్రమించుకుంటూ అక్కడ క్రౌర్యాన్నీ, అశాంతినీ ప్రేరేపిస్తూ ఉంటారు. పూర్వం ఇలాంటి ధర్మవిరోధులనే రాక్షసులుగా పేర్కొంటూ "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ......" అంటూ ఆ భగవానుడు రామ కృష్ణాది అవతారాలు ధరించి, అటువంటి ధర్మద్రోహుల్ని ఈ భూభాగం నుండి తొలగించి, మన కర్తవ్యాన్ని బోధిస్తూ వచ్చాడు. ఈ పవిత్రభూమిని మళ్ళీ ధర్మప్రచారానికి కేంద్రంగా స్థాపిస్తూ వచ్చాడు.

సమాజంలోని వ్యక్తులనందరునూ ప్రేమభావనతో బంధించి వైయక్తికంగాను, సామాజికంగాను, సుఖశాంతులతో జీవింపజేసేది ధర్మం. ఇది విశ్వజనీనం. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ, అహింస, సత్యము, ఆస్తేయము మొదలైన ఉదాత్త భావాలతో జీవింపజేసేది ధర్మం.

భగవదారాధనా విధానాలలో భిన్నభిన్న మార్గాలను నిర్దేశించే విమతాలు. ఇది అధిక భాగం వైయక్తికమే. ఎవడికి నచ్చిన మార్గంలో వాడు భగవంతుడిని ఆరాధించుకోవచ్చు. దీన్ని ఇంకొకని మీద రుద్దవలసిన పనిలేదు. బలవంతంగానో ప్రలోభపెట్టో యిలా రుద్దటం అధర్మం. "అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ" అని ఏ జీవిని కూడా ద్వేషించవద్దు, మైత్రితోనూ, కరుణతోనూ చూడు అని చాటే





సనాతన ధర్మం, ఈ భారతీయ ధర్మం. ఎటువంటి అధర్మాన్ని సహించదు. మన రాజ్యాంగం కూడ మతాతీత రాజ్యాంగం (సెక్యులర్). ఈ భారతదేశం భారతదేశంగా నిలబడిన నాడు, దురాక్రమణలను ఎదిరించి నిలిచిన నాడు మాత్రమే ఈ విశ్వజనీన ధర్మం నిలబడుతుంది.

దేశం శరీరం వంటిది. ధర్మం ఆత్మ వంటిది. ఆత్మకు శరీరం ఎలా ఆధారమో, ధర్మానికి దేశం అలాగే ఆధారభూతమై ఉంటుంది. అంచేత ఈ మహత్తరమైన విశ్వశాంతి కారకమైన ధర్మ రక్షణ కోసం దేశ రక్షణ అత్యంతావశ్యకం.

# తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త

\- ఇమ్మిడిశెట్టి ప్రభాకరరావు

దండకారణ్యంలో ఒక మర్రిచెట్టు మీదొక పావురం గూడు కట్టుకొని ఉండేది. అది ఎంతో అందంగా బలిష్టంగా ఉండేది. దానికి యవ్వనం రాగానే తనకి సరిజోడు అయిన ఆడపావురంతో ప్రేమలో పడింది. ఆ జంట అన్యోన్యానురాగంతో శరీరాలు వేరే అయినా ఒకే ప్రాణంగా జీవించ సాగింది. అవి ప్రేమ కలాపాలతోనే పొద్దుపుచ్చుతూ ఒక్క క్షణం కూడ ఎడబాయక జీవించేవి. కొన్నాళ్ళకు వాటికి రెండు పిల్లలు కలిగాయి. ఇప్పడిక వాటి ధ్యాస, ఆలోచన అంతా పిల్లల పెంపకం, వాటి భవిష్యత్తు గురించే. వాటి అల్లరి బాల్యచేష్టము, బుడి బుడి నడకలు చూచి, తేనెలూరే మురిపాల ముద్దుపలుకులు విని తన్మయత్వంతో మురిసి మైమరచి పోయేవి. రకరకాల మేత తెచ్చి తమ ముక్కులతో వాటి నోటిలో పెట్టి తినిపిస్తూ మహాసంబరబడిపోయేవి. వాటికిప్పడు పిల్లలతోడిదే లోకం. ఆఖరుకు ఆ పిల్లల కోసం వాటి ప్రాణాలివ్వడానికయినా అవి సిద్ధం.

కాలం ఎప్పడూ ఒకలా గడవదు కదా! పావురాలు ఒక రోజున మేత తేవడానికి వెళ్ళాయి. అంతలో ఒక బోయవాడు పక్షుల కిలకిలారావాలు విని ఆ మర్రిచెట్టుకి దగ్గరలో వలవేయగా కొన్ని పక్షులా వలలో చిక్కాయి. పాపం ఇప్పడిప్పడే బుల్లి రెక్కలతో బుడిబుడి ఎగురటాకులు నేర్చుకుంటున్న అభం శుభం తెలియని చిన్నారి పసికూనలు కూడా వలలో చిక్కి గోలగోలగా ఏడవసాగాయి.

తిరిగి వచ్చిన పావురాల జంటకు గూటిలో పిల్లలు కన్పించక పంచ ప్రాణాలు పోయినంత పనయింది. ఎలాగో గుండెలు చిక్కబట్టుకుని ఆందోళనగా చెరోప్రక్కకీ వెతకడానికి వెళ్ళాయి. మొదటగా తల్లిపావురానికి బోయవాడి వలలో చిక్కి ఏడుస్తూన్న తమ పిల్లలు కనిపించాయి. తల్లిని చూచి అవి మరింత దీనంగా “అమ్మా! అమ్మా!” అంటూ ఏడవసాగాయి. తల్లి ప్రేమకు అవధులు లేవు కదా! మాతృ ప్రేమావేశంలో కళ్ళ ముందు ప్రేమ పొరలు క్రమ్మి తల్లి పావురానికి బుద్ధి మందగించింది. పిల్లల్ని రక్షించ బోయి వివేకశూన్యంగా అది కూడా వలలో చిక్కి పిల్లలతోపాటుగా ఏడవ సాగింది. ఇంతలో తిరిగి వచ్చిన తండ్రి పావురానికి అనురాగాలొలికిస్తూ స్వర్గసుఖాలందించిన తన ప్రియురాలూ, కన్న సంతానము” ప్రాణాపాయ స్థితిలో ఉండడం కంటబడింది. దానికి ప్రియురాలితో గడిపిన మధుర మయిన పాత రోజులు, పిల్లల బాల్యచేష్టలు, వాటి ముద్దుపలుకులు గుర్తు కొచ్చాయి. దానికి దుఃఖం ఆగలేదు. “అయ్యో! భార్య దక్కినా మళ్ళీ సంతా నాన్ని పొందవచ్చు. పోనీ బిడ్డలలో ఏ ఒక్కరు చిక్కినా గతించిన భార్యా బిడ్డలను దానిలో చూసుకుని బ్రతకవచ్చు. నేనిప్పడీ ప్రపంచంలో ‘నా’ అనే వాళ్ళెవరూ లేని ఏకాకిని కదా! ఈ శూన్య జగతిలో, నిరాశా నిస్పృహ లతో మొండిగా, మోడుగా నేనెవరికోసం బ్రతకాలి? ఇన్నాళ్ళూ నా భార్యా బిడ్డలతో కలిసి సుఖంగా జీవితం పంచుకున్నాను. మరణంలో మాత్రం నేను వీరినెడబాయనేల?” అని వారితోడిదే లోకం అన్నట్లుగా ఆలోచిం





చింది. దుఃఖం, మమకార బంధాల వలన అది యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం కోల్పోయింది. మంట వెలుగును చూసి ఆకర్షింపబడి మాడిపోయే మిడతలాగ ప్రేమపాశబద్ధురాలై మాయమోహాలావరించగా తండ్రి పావురం కూడ స్వయంగా, బుద్ధి పూర్వకంగా బోయవాడి వలలోనికి దూకింది. తన భార్యాబిడ్డలతోపాటుగా మరణించింది.

ఆహా! సంసార బంధం ఎంత బలీయమయింది! ఆ పావురం జీవిత మంతా భార్యాబిడ్డలతోడిదే లోకమనుకుని బ్రతికింది. దేహం ధరించింది భగవదనుగ్రహంతో మోక్షం పొందడానికని తలంచక తన జన్మకర్మలన్నీ భార్యాబిడ్డలతోనే ముడిపడియున్నాయని భ్రమించి నిండు ప్రాణాల్ని వృథాగా వారికై అర్పించింది.

బోధ : ఈ ప్రపంచము అనిత్యము, భార్యాబిడ్డలు, బంధువులు మొదలయిన వారితో బంధమశాశ్వతం. మానవుడు జీవించినంతకాలం ధనేషణ, దారేషణ, పుత్రేషణ ఇవే ఈ షణత్రయంతో చిక్కి అవే పరమార్థమని భ్రమిస్తూ, పరమాత్మ చింతన మరచి మోక్షమార్గానికి దూరమవుతున్నాడు.

మానవజన్మ మోక్షము, నరకము రెండింటికీ కూడ తెరువబడిన ద్వారం లాంటిది. శృతి మించిన సంసార లంపటంలో, మమకార వ్యామోహాంధకారంలో కూరుకుపోయి ఎన్నో లక్షల జన్మల తర్వాత ప్రస్తావించిన పరమదుర్లభమైన ఈ మానవజన్మను వ్యర్థపరచుకోరాదు. సంసారులకు భార్యాబిడ్డలతోడి బంధం తగుమాత్రంగా తామరాకు మీది నీటిబొట్టులా వుండాలి. బురద నీటిలో నున్ననూ, బురద అంటని చేపలా సంసారంలో వున్ననూ సంసారపంకమంటించుకోరాదు. అదే మోక్షమార్గం. అదే పై కపోతమిధునం కథ నుంచి మన గ్రహించవలసిన జ్ఞానబోధ.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

స్వామీజీ చాలాకాలం వరకు ఒక తుండును కట్టుకుని మరొక తుండును తలపాగాగ ధరించెడి వారు. శరీరముపై చొక్కాగాని, కనీసం బనీనుగానీ ధరించెడి వారు కాదు. వయస్సు మీరిన తరువాత స్వామీజీని తరుచూ అస్తమా బాధించుటచే వైద్యుల సలహాపై ఖద్దరు బనీను ధరించుట మొదలుపెట్టెను. ఒకనాడు బొంబాయి నుండి ఒక భక్తుడు సాయి దర్శనార్థమై షిరిడీకి వచ్చి తాను రోజు ఒక భక్తునికి భోజనమేర్పాటు చేయదలంచి అందుకుగాను కొంత పైకాన్ని సమాధి మందిర పూజారిగా పనిచేస్తున్న ఉద్ధనరావు దేశ్‌పాండే గార్కి సమర్పించెను. స్వామీజీ అంత పిన్న వయస్సులోనే ఎంత పరిణితి చెందిన వ్యక్తులకన్నా మిన్నగా సాయి సేవ చేస్తూ ఆ సేవకే తన జీవితాన్ని అంకితము చేసిన స్వామీజీకన్న మిన్నయైన భక్తుడు లేడని తలంచి బొంబాయి భక్తుడు సమర్పించిన ధనముతో భోజనాన్ని బాబాకు నివేదించి దానిని స్వామికి ఇచ్చేవారు. ఆనాటి నుండి అదే ఆచారంగా మారి స్వామి సమాధి చెందే వరకూ సాయికి నివేదించిన ప్రసాదాన్ని స్వామికి ప్రసాదించేవారు షిరిడీ సాయి సంస్థాన్‌వారు. స్వామీజీకి పూర్వముగాని స్వామి సమాధి చెందిన తరువాత గాని ఈ అదృష్టము మరియొక భక్తునకు కలుగలేదంటే బాబాకు స్వామిపై ఎంతటి ఆదరాభిమానములున్నవో చదువరులు గ్రహింతురు గాక. ఈ విధముగా స్వామీజీకి ఆకలి ఆమడదూరమాయెను. ఏ చీకూ చింతా లేక స్వామీజీ తన పూర్తికాలాన్ని సాయి సేవకే అంకితమొనరించి ప్రశాంత జీవనము కొనసాగించెను.





ఒక పర్యాయం స్వామీజీకి ద్వారకామాయిలో పడమర కుడ్యమునకు గల బాబా బండపై ఆశీనుడైన ఛాయాచిత్రంలో ముప్పురు వ్యక్తులు దర్శనమిచ్చెను. అందులో ఒక లక్ష్మీనాథ్ జటాశంకర్ త్రివేది. ఈయనను స్వామీజీ ప్రథమంగా ఖండోబా మందిరం చెంత కలుసుకున్నారు. బాబా పటంలో అగుపించిన వ్యక్తి కళ్ళెదుట కనిపించే సరికి స్వామి ఆశ్చర్యభరితులై ఆయనకు నమస్కరించి పరిచయం చేసుకున్నారు. ఇరువురూ అకుంఠిత సాయి భక్తులగుటచే అనతికాలమందే మంచి మిత్రులయ్యారు. త్రివేది నూట ఎనిమిది పర్యాయములు షిరిడీకి వచ్చి బాబాను దర్శించుకునెను. ప్రతి పర్యాయము తనతో భక్తులను షిరిడీకి తీసుకువచ్చి వారికి బాబా లీలలను వివరించుట, షిరిడీలోని పవిత్ర ప్రదేశాలను చూపించుట చేసి వారిలోని సాయి భక్తిని పెంపొందించేవారు. బీదలకు విరివిగా అన్నదానము, వస్త్రదానము చేసేవారు. ధునికి సమర్పించడానికి ఆవునెయ్యి, సాంబ్రాణి, అగరువత్తులు, మొదలగు దీపాలు వెలిగించడానికి నూనె, స్వామీజికి వస్త్రములు, ఆధ్యాత్మిక గ్రంథాలను సమర్పించేవారు. ఒకసారి ఈయన పెద్ద డబ్బా నిండా నూనెను తెచ్చి స్వామీజికి ఇచ్చి ద్వారకామాయిలో దీపాలను వెలిగించమని కోరారు. ఆరోజు ఆ నూనెతో ద్వారకామాయిలో బాబా సశరీరులుగా ఉన్నప్పడు వెలిగించే దీపాల సంఖ్యకు తగ్గకుండా ద్వారకామాయి మొత్తం దీపాలతో అలంకరించగా అది గాంచి భక్తవరేణ్యులు ఆ రోజు దీపావళిని మరిపించినదని ఆనందభరితులయ్యారు. మరొకసారి త్రివేదిగారు స్వామీజీకి అతి విలువైన నూతన వస్త్రములను ధరించుటకు మనస్సంగీకరించక వాటిని ఒక ఫకీరుకు సమర్పించారు. ఆ ఫకీరు ఆ వస్త్రములను ధరించి అక్కడకు అతి సమీపమున పారాయణ చేసుకుంటున్న త్రివేది చెంతకేగెను. ఆ ఫకీరును గాంచిన త్రివేది ఆ వస్త్రములను తాను శివనేశన్ స్వామికివ్వగా ఈ ఫకీరు దగ్గరకు ఎలా వచ్చినాయని ఆలోచించుచుండగా ఆ ఫకీరు "నీవు

నాకు చాలాకాలం నుండి తెలుసు. ఈ వస్త్రాలను నీవు శివనేశన్‌కు సమర్పించినవే" అని చెప్పి అచట నుండి వెడలిపోయెను. అది చూచిన త్రివేది ఆ ఫకీరును తానింతకు పూర్వము చూచి ఉండకపోయినను అతను చాలాకాలం నుండి తెలుసునని చెప్పాడు, ఇదేలా సాధ్యమా అని స్వామీజీ దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించగా స్వామీజీ వెంటనే "ఆ ఫకీరు ఎవ్వరో కాదు సాక్షాత్తు సాయినాథుడే. లేకపోతే ఆ వస్త్రాలను నీవు నాకిచ్చావని అతనికెట్లా తెలుస్తుంది? "ఇది సాయినాథునికి తప్ప అన్యులకు అసాధ్యమని వివరించగా త్రివేది మనస్సు ఆనందడోళికలలో తేలియాడి సాయినాథుని దర్శనమునకు కారణమైన స్వామీజీని కొనియాడి ప్రేమాభిమానములతో కౌగిలించుకొనెనె. సాయి సాక్షాత్కారమునకు 'నీవంటే నీవే కారణమని' ఒకరినొకరు అభినందించుకొనిరి. ఈ సంఘటన మనం సాయినాథుని పేరిట ఎవ్వరికి ఏమి సమర్పించినా అది బాబాకే చెందునని తేటతెల్లము చేయుచున్నది గదా!

స్వామీజీకి బాబా చిత్రపటంలో అగుపించిన రెండవ సాయిభక్తుడు శ్రీ ఎం.ప్రభు. ఈయన తమిళనాడుకు చెందినవారు. ఈయన కుటుంబ సభ్యులంతా బాబాకు అనన్యభక్తులే. వీరి కుటుంబమును గూర్చి కొంతలో కొంతైనను వివరించకపోతే ఈ గ్రంథము అసంపూర్ణమే యగును. ప్రభు కెమిస్టుగా ఉద్యోగము చేసెడివారు. ఈయన శ్రీమతి వారిజ తీవ్ర అస్వస్థతతో బాధపడుచుండ ఎంతోమంది ప్రముఖ వైద్యులను సంప్రదించినను ఆమెకు ఉపశమనము కలుగలేదు. మృత్యువుతో పోరాడుచు జీవితమును కొనసాగించుచుండెను. ఒకనాడు 'ది హిందూ' దినపత్రికలో పూజ్య నరసింహ స్వామీజీ కోయంబత్తూరులో 'నాగ సాయి' మందిరమునకు విచ్చేయుచున్నారనియు, సాయినాథుని అనుగ్రహముతో అసంఖ్యాక అనారోగ్యులను ఆరోగ్యవంతులుగా చేసిరనియు కూడ ప్రకటింపబడెను. చిట్టచివరి ప్రయత్నముగా ప్రభు తన శ్రీమతిని వారి చివరి సంతానమైన





బి.విన్నీని తీసుకుని నరసింహ స్వామీజీ దర్శనార్థమై కోయంబత్తూరు వెళ్ళి స్వామీజీని దర్శించి తన భార్య అనారోగ్యమును బాపుమని వేడుకొనెను. నరసింహ స్వామీజీ శ్రీమతి వారిజకు 'అచ్యుతానంత గోవింద' యను మంత్రము నుపదేశించి దినమునకు ఇరువది ఒక్క మార్లు ఇరువది ఒక్క దినములు నిష్ఠతో పఠించమనియు, నిత్యము బాబా ఊదిని నీటిలో కలిపి తీర్థముగా స్వీకరించవలెనని సెలవిచ్చిరి. ఆమె ఆ విధముగా చేయగా ఆరోగ్యము కొంత మెరుగై అతి త్వరలోనే ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలయ్యెను. నాటి నుండి ఆ కుటుంబమునకు బాబా ఆరాధ్యదైవమాయెను. స్వామీజీ చేసిన ఉపకారమునకు ధన్యవాదములు చెప్పటకుగాను మరల స్వామీజీని కలవగా ఆయన చిరునవ్వుతో 'నేను నిమిత్తమాత్రుడను, చేసెడిది, చేయించెడిది అంతా బాబాయే' అని వినయముగా పలికి ప్రభూ 'నీవు మధ్య భారతదేశములో బాబా ప్రచారము చేయుము' అని సెలవిచ్చెను. అటుపిమ్మట అనతికాలములోనే ప్రభూకి మధ్యప్రదేశ్‌లో గల జబల్‌పూర్‌కు బదిలీ అయెను. అచట ఉద్యోగము చేయుచునే బాబా భజనలు, సత్సంగములు జరుపుచూ బాబా ప్రచారము ప్రారంభించి బాబా భక్తుల సంఖ్య పెరగగానే ఒక బాబా మందిరమును కూడ నిర్మించి దాని నిర్వహణ బాధ్యతలు కూడ చక్కగా నిర్వహించెను.

వీరి కుటుంబమంతయు ప్రతి సంవత్సరము షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి సేవించెడివారు. వీరి చివరి సంతానమైన బృంద మరియు విన్నీ కూడ వీరితో షిరిడీ వెళ్ళెడివారు. వీరు 1955వ సం.లో షిరిడీ వెళ్ళగా స్వామీజీ ప్రభుని చూచి తనకు బాబా చిత్రపటమందు అగుపించినది ఈయనేయని గ్రహించి తనను తాను పరిచయము చేసుకొనెను. అందరూ సాయిభక్తులగుటచే ఒకే కుటుంబసభ్యులుగా కలసిమెలసి ఉండెడివారు. ప్రభు ఆయన శ్రీమతి వారిజ స్వామీజీని తన కుమారునివలె ఆదరించెడి వారు. స్వామీజీ, విన్నీల బంధము స్వామీజీ సాధకురాలువలె గాక అన్న అల్లరి చెల్లెలవలె ఉండెడిది.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

జూలై 14 నుంచి మొదలైన యోగా, సాధనా క్యాంపు ఆగస్టు 4వ తేదీ ముగింపు జరిగింది. 21 రోజులు సాగిన ఈ సాధనా క్యాంపులో చిన్నతనంలోనే పూజ్య గురుదేవుల దగ్గర నేర్చుకున్న విషయాలను లోతుగా పరిశీలించి అవగాహన చేసుకునేలా శ్రీ రవీందర్ బాపూజీ పిల్లలకు, పెద్దలకు ఎంతో ప్రేమతో చెప్తూ, కఠినంగా దండిస్తూ మా మాతాజీని ఇరవై ఒక్క రోజులూ గుర్తు చేసారు.

21వ రోజు ముగింపు కార్యక్రమంలో ప్రతి జీవిలో పరమాత్మను దర్శిస్తే జీవితం ఎంత ఆనందమయంగా ఉంటుందో తెలిసేలా చేసారు. ఈ క్యాంపులో ఉన్న ముప్ఫై మంది జీవితంలో ఎప్పుడూ ఆనందించలేనంత ఆనందాన్ని పొందారు.

ఈ ముగింపు కార్యక్రమానికి సహకరించిన అరవిందాక్షన్ నాయర్, తంగమణిగార్లకు, వారికి సహకరించిన ప్రేమలతకు సాయి సేవా సమితి ట్రస్టు పక్షాన సత్కరించి పూజ్య గురుదేవుల జ్ఞాపికను అందించారు. సభ్యులు, యోగాచార్యులైన శ్రీ బాపూజీ రవీందర్‌గారిని సాయిరామ చైతన్యగారు శాలువతో సత్కరించి పూజ్యగురుదేవుల జ్ఞాపికను అందించారు.

ఆగస్టు 9వ తేదీ సిరులనొసగే తల్లి వరలక్ష్మీదేవి వ్రతం. ముందురోజు రాత్రే అమ్మవారిని తయారుచేయడం, అలంకరించడం, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు ఆశ్రమ ఆడపడచులు. తొమ్మిది రకాల నివేదనలతో, భక్తులకు పంచడానికి ప్రసాదాలు ఉదయాన్నే తయారయ్యాయి. ముత్తైదువలు, కన్నెపిల్లలు, చిన్నపిల్లలు, కొత్తబట్టలు, పువ్వులు, పూజా సామాగ్రీలతో దేవాలయం కళకళలాడుతోంది. ముత్తైదువులంతా





సాక్షాత్తూ ఆ వరలక్ష్మీదేవతే వచ్చారేమో అన్నట్లుగా ఉన్నారు. 40మంది సువాసినులు పూజకు కూర్చోగా, వారితో వచ్చినవారు, ఇతర భక్తులతో దేవాలయం నిండిపోయింది. మండపంలో అమ్మవారు ఎర్రని పట్టుచీరతో, ఒంటినిండా నగలతో, పసుపు-కుంకుమ, పూలతో ఎంతో అందంగా ఆశీనులైనారు. సాయిరామ చైతన్యగారు వరాలనొసగే ఆ తల్లి మహిమలను వివరిస్తూ పూజ మొదలుపెట్టారు. ఆ దేవి కరుణ మనపైన ఉండాలంటే మనుష్యులమైన మనం ఎలాంటి ప్రవర్తనను కలిగి ఉంటే బాగుంటుందో వివరించారు. ఈ తరం ఆడపిల్లలు నిండైన దుస్తులు ధరించమన్నా, గాజులు, బొట్టు, పూలు పెట్టుకోవడమన్న ఇష్టపడటం లేదు. మన సంప్రదాయాలను మంచి విదేశీయుల మోజులో మన పిల్లలను పెంచుతున్నాము. ఈ తప్ప తల్లులదే, తల్లిదండ్రులు జీవితమంతా ఆలోచించండి మీ ఇంటి ఆడపిల్ల లక్ష్మీదేవిలా ఉండాలి. కానీ చూసిన వాడికల్లా ఆటబొమ్మగా ఉండకూడదు. ఎప్పటికప్పడు మన సంస్కృతీ సంప్రదాయాలను చెప్తుండండి. భారతీయ ధర్మానికి అనుగుణంగా మన ప్రవర్తనను ఉంచుకోవాలి. ఇలా మీరందరూ ఉంటారనీ ఆ వరలక్ష్మీదేవి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ముగించారు. పూజ మొత్తం ఏ ఆటంకం లేకుండా ప్రశాంతంగా, సంతోషంగా సాగింది. అనంతరం ముత్తైదువులంతా ఒకరికొరకు తాంబూలాలిచ్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం ప్రసాద వినిమయం జరిగింది. క్రితం సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా సాయిధామం ప్రక్క గ్రామమైన పెద్ద పర్వతాపురం గ్రామవాసులు మా ఊరిలో కూడా వరలక్ష్మీవ్రతం చేసుకుంటామని, సాయిరామ చైతన్యగారే చేయించాలని కోరగా వారిని ఏర్పాట్లు చేసుకోమని ఆజ్ఞ ఇచ్చారు. మాజీ సర్పంచ్ అయిన సాయిచంద్ర గారి ఆధ్వర్యంలో ముత్తైదువులతో పూజ చక్కగా చేయించారు సాయిరామ చైతన్యగారు. వరలక్ష్మీదేవి గొప్పదనాన్ని వివరిస్తూ ఆ తల్లి నుంచి ఏం నేర్చుకోవాలో వివరించారు. అందరం కలిసి

చేసే పూజలో శక్తి ఎక్కువగా ఎందుకు ఉంటుందో వివరించారు. మీ గ్రామం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా ఉండాలంటే మీ జీవన విధానాలను మార్చుకోవాలని అప్పుడు ఆ దేవి కరుణాకటాక్షాలు మన మీద ఉంటాయని వివరించారు.

అనంతరం భక్తులంతా ప్రసాదాలు స్వీకరించి సంతోషంగా ఇళ్లకు తరలివెళ్లారు.

ఆగస్టు 15వ తేది 73వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో కార్యక్రమం ఎంతో చక్కగా సాగింది. భారత మాతను దర్శించడం, పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ ఇచ్చింది. సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నికృష్ణుడిలా అందరినీ అలరించిన చి॥ మేఘన (3వ తరగతి) అభినయానికి ముగ్ధులైన పెద్దలు పారితోషికంతో దీవించారు. అనంతరం శ్రీ సాయిరామ చైతన్యగారు, డా॥ జి.చంద్రారెడ్డిగారు 370 ఆర్టికల్ రద్దు చేయడం వల్ల జరిగే ఉపయోగాలు వివరించారు. ఆర్టికల్ ఉంటే దాని వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎవ్వరూ చెయ్యలేని సాహసోపేతమైన పనిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ గారు మాత్రమే చెయ్యగలిగారని వివరించి వారిలాగా మన జీవితాలను మలచుకోవాలని వివరించారు.

ఆగస్టు 17వ తేదీ పూజ్య మాతాజీ గురుదేవుల సన్నిధికి చేరి మూడు సంవత్సరాలు గడిచిపోయింది. ఈ రోజు అనగా 17.08.2019నాడు పుణ్యతిథి సందర్భంగా మాతాజీగారికి పూజ, పిండ ప్రదానాలు జరిగాయి. అనంతరం మాతాజీగారి గురించి సాయిరామ చైతన్యగారు ప్రసంగిస్తుంటే భక్తులు కన్నీటిపర్యంతమయ్యారు. పూజ్య మాతాజీ పేరు బలం ఎంత గొప్పదో 100 మందికి పైగా వారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీ సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థులకు పులిహోర, రవ్వకేసరి ప్రసాదాన్ని వినిమయం చేయడం జరిగింది.





# మనన యోగ్య శ్లోకాలు

శ్లో॥ అంతర్గత మలో దుష్టః తీర్థ స్నాన శతైరపి ।
సశుద్ధ్యతి యథాభాండం । సురాయాః దాహితంచ తత్ ॥

**- చాణక్య నీతిశాస్త్రము**

తా :లోపల దుష్టత్వమున్న దుష్ట మానవునకు నూరు తీర్థములలో స్నానము చేసినను ఆ దుష్టత్వము పోయి శుద్ధత్వము రాదు. కల్లు కుండను ఎన్ని విధాలుగా శుభ్రపరిచినను చివరకు కాల్చినను దాని వాసన పోదు కదా!

లోకంలో దుష్టక్రియలు చేసే వారిలో రెండు రకాల వారున్నారు. సహజంగా మంచి మనస్సు కలిగి ఉండి కూడా దుష్ట సహవాసం వలనో, తాత్కాలిక ఆవేశానికి లొంగి పోవటం వలనో యాదృచ్ఛికంగా ఇతరులకు అపకారం చేసేవారు ఒక రకం వారు.

వీరికి సరైన మార్గదర్శకత్వం దొరకకపోవటం వలన బలహీనతలకు లొంగిపోతూ ఉంటారు. సదుపదేశాల వలన, సత్సంగం వలన వీరిలో మార్పు వస్తుంది. పశ్చాత్తాపం కలుగుతుంది. ఇలాంటి వారిని గురించే 'దుర్మార్గుడు ఎప్పుడూ దుర్మార్గుడుగా ఉండడు' అనే లోకోక్తి పుట్టింది.

మరికొందరికి వంశ పారంపర్యాననో (జీన్స్), జన్మతఃనో కొన్ని దుర్మార్గ లక్షణాలు వస్తాయి. వారు పెరుగుతున్న వాతావరణాన్ని బట్టి (పరిసరాల ప్రభావాన్ని బట్టి) వారికి దొరికే ఉపదేశకులను బట్టి (ప్రతి దినంకానీ, వారం వారం కానీ వారికి బోధింపబడే ద్వేషం, క్రౌర్యం వలన) వారు కరుడుగట్టిన దుర్మార్గులుగా మారతారు.

అలాంటి దుర్మార్గులకు చేసే హితబోధ 'చెవిటి వాని ముందు శంఖం ఊదిన దానితో సమానం'. వారు మారరు సరికదా ఈ బోధకులను వారు చవటల క్రింద లెక్కగడతారు. ఈ బోధకులు కొండొకచో తమ అసమర్థత వలన వారికి అలుసు ఇచ్చిన వారవుతారు.

'దుర్మార్గులందరినీ కూడా మంచి ఉపదేశాలతో మార్చవచ్చు' అనటం గొప్ప ఆదర్శంగానే కనపడుతుంది. కానీ వ్యవహారరీత్యా మాత్రం ఇది అసంభవం అని వేల సంవత్సరాల చరిత్ర నిరూపిస్తున్నది. ఇలా ఆదర్శాన్ని వల్లె వేసే వాళ్లకు ఒక సౌలభ్యం ఉంది. వారికి వ్యతిరేకంగా ఈ కరుడుగట్టిన దుర్మార్గులు ఏమీ చర్య తీసుకోరు సరికదా మహాత్ములని కీర్తిస్తారు. దాంతో వీరికి-ఈ సిద్ధాంతాన్ని మోసుకు తిరిగే వీరి అనుచరులకు తమ పబ్బం గడుస్తుంది. మిగతా జనం ఎన్ని బాధలు పడితేనేమి గాక.

తమాషా ఏమిటంటే వీరు అప్పుడప్పుడూ ప్రపంచానికే ఉత్తమోత్తమమైన వేదాంత/ధార్మిక గ్రంథం-భగవద్గీతనే ఉటంకిస్తుంటారు. కానీ అంతరాంతరాలలో ఆ జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మ కంటే తెలివైన వాళ్లమని భావిస్తుంటారు.

ధర్మస్థాపనకై అవతరించిన ఆ పరమాత్ముడు దుష్టుల (దుర్యోధనాదుల) దుష్టత్వాన్ని వేలెత్తి చూపి, వారలను సన్మార్గంలో పెట్టాలని ప్రయత్నిం చాడు. వారు- పైన పేర్కొనబడిన శ్లోకంలోవలె మారటానికి తిరస్కరించినప్పుడు-

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం" అంటూ ఆ దుర్మార్గులను అంతం చేసి (స్వీయ బంధువులైనప్పటికి) ధర్మస్థాపన చేసి, సవ్యమార్గాన్ని చూపించాడు. అంతేకాని సత్యాగ్రహం చేస్తానని కూర్చోలేదు.

ఆ తరువాత సుమారు రెండు వేల ఐదు వందల సంవత్సరాలకు అవతరించిన ఆర్య చాణక్యులవారు కూడ ఆ భగవద్గీతనే అనుసరిస్తూ ధర్మరాజ్యాన్ని స్థాపించారు.

వారు అనుసరించిన నీతి వలన ఆనాడు ధర్మస్థాపన జరిగింది. ఆచరణాత్మకమైన ఆ విధానాన్ని ప్రక్కనపెట్టి 'మహాత్ములము, శాంతి దూతలము' అని పేరు తెచ్చుకోవాలనే తాపత్రయంలో గీతాబోధను మరిచి ఒక విధమైన పరోక్ష మార్గంలో దుర్మార్గుల కొమ్ముకాస్తూ ఉండటంతో నేటి కాలంలో జరుగుతున్న ధర్మగ్లానిని చూస్తూ ఉన్నాము.

ఈ విపరీత ధోరణుల వలన సనాతన ధర్మం ఈ ప్రపంచంలో నుండే క్రమక్రమంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం కన్పిస్తున్నది-తస్మాత్ జాగ్రత్త.





# శ్రీ సాయినాథానందలహరి

తారాగణం : రండి! రారండి సజ్జనులారా! రండి

1. దేహమున్నంత కాలమే - మీ హితమ్ము
కూర్చు కొనవచ్చు గావున - కూర్మిరండి
సాయినాథుని సేవింప - సత్వరమ్ము
తల్లి తండ్రి గురువు - పరమ సర్వస్వమ్ము
సాయినాథ! నీవె - స్వామి! మాకు
నీదు దివ్యచరణ - నీరజముల చెంత
మాకు స్థానమిమ్ము - మహ్యదీశ !
అజ్ఞానమనెడి - అంధకారమ్ము
బాపుసూర్యుడవీవు - బాబా! ఓ సాయి!
జ్ఞానదానమొసంగి - సాయీశ! మమ్ము
కరుణ కోర్కెల దీర్చి - కావుమయ్య!
ఆరగింపవే పోయిత్తు - ఆర్తిపోగా! సాయిరాం
నీదు బొజ్జలోనగలవు - నిఖిల లోకముల్ ప్రభూ
నేనొసంగు కలకండను - నీవుగొనవె ప్రేమతో
దీనావనమాకిక - దిక్కునీవె! సాయిరాం
మందబుద్ధిగలవాడను - అతిపాపిని పతితుడన్
వందనములు సేతువేగ - వచ్చి నన్ను బ్రోవుమా
భవజలధినిమునుగు మమ్ము - త్వరగనుద్ధరింపు
అవధిలేని సుఖమునిమ్ము - అనవరతము సాయి
నీ పదాబ్జములను - నిత్యమ్ముకొలుచు
జనుల చంచలమతుల - సరిదిద్దుమయ్య
స్థిరభక్తినిడి - మాయతెరతొలగించి
చేర్చుకో నీలోన - శ్రీ సాయినాథ!



# ఆశ్రమ భిక్ష పథకం



# అన్నదాన పథకం

శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయీ భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యులవుతారు. సంవత్సరానికొకసారి చొప్పన వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియజేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- ధర్మాధికారి, సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**





# ప్రశాంతి

ఇది ఒక యతీశ్వరుడు నడయాడిన చోటు. పాతికేళ్లుగా నిరంతర సత్సంగాలు నడుస్తున్న తావు-శ్రీ సాయినాథుల వారికన్నా ముందరే వారెక్కడ ప్రతిష్ఠింపబడాలో తామే లిఖితపూర్వకంగా చూపిన ఆలయం- పూలతోటలాంటి చక్కని పాఠశాల, ఆనందోత్సాహాలతో తిరిగే శిశుమందిరం వంటివి ఉన్న 33 ఎకరాల వైశాల్యం ఉన్న ప్రదేశం. అలాంటి యీ -

సాయిధామంలోని వానప్రస్థాశ్రమం ప్రశాంతి. ఆధ్యాత్మిక చింతన, కొంతయినా సేవాదృక్పథం ఉన్న - 55 సం।। పైబడిన 75 సం।। దాటని వృద్ధులెవ్వరికైనా యిది సాదరంగా స్వాగతం పలుకుతుంది.

## ఆశ్రమం కల్పించేవి

- చక్కని ప్రశాంత ప్రకృతి సహజ వాతావరణం.
- సాత్త్వికమైన అల్పాహార, భోజనాలు.
- నిత్య సత్సంగం.
- కులభేదాలు లేని సమభావం.
- సాయిబాబా, దత్త దేవాలయాలు, భారతమాతల నిత్య సందర్శనభాగ్యం.
- మంచి గ్రంథాలయం.

## ఆశ్రమంలో చేరదలచుకొన్నవారి బాధ్యతలు

- ఆశ్రమ ప్రశాంతతకు అనుగుణంగా ఉండటం.
- సేవా కార్యక్రమాలకు చేతనైనంతగా సహకరించడం
- వారి వసతికీ, భోజనాదికాలకూ చెల్లించవలసిన రుసుమును సక్రమంగా చెల్లించటం.

**ప్రశాంతిలో చేరదలచిన వారు దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.**

**పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి**
**దివ్యాశీస్సులతో,**
**ధర్మాధికారి**
**ఫోన్స్ : 9440413455, 9848133565**